క్లుప్తంగా

సమ్మె విరమణ

గూడూరు/గార్ల/డోర్నకల్: 34రోజులుగా చేస్తున్న సమ్మెను పంచాయతీ కార్మికులు బుధవారం విరమించారు. గార్లలో ఎంపీడీఓ జి.రవీందర్ కార్మికులకు నిమ్మరసం ఇచ్చి సమ్మె విరమింపజేశారు. గూడూరులో ఎంపీఓ చంద్రమోహన్‌కు వినతి పత్రం అందించారు. డోర్నకల్‌లో ఎంపీడీఓ అపర్ణ, ఎంపీఓ మున్వర్‌బేగ్‌కు వినతిపత్రం అందించి విధుల్లో చేరారు.

సన్మానం

నెహ్రూసెంటర్: జిల్లా వైద్యరోగ్య అధికారిగా పని చేసిన డాక్టర్ బి.హరీశ్‌రాజ్, జిల్లా ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓగా నియమితులైన డాక్టర్ అంబరీషను బుధవారం శాలువాతో ఘనంగా సన్మానించారు.

శంకుస్థాపన

డోర్నకల్: స్థానిక బీఎస్ఎన్ఎల్ టవర్ సమీపంలో రూ.20లక్షలతో నిర్మిస్తున్న బస్తీ దవాఖానా భవనానికి బుధవారం మున్సిపల్ చైర్మన్ వీరన్న శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కోటిలింగం, వైద్య శాఖ డీఈ విద్యాసాగర్, ఏఈ నరేష్‌రెడ్డి, కౌన్సిలర్లు జనార్దన్, శరత్, అశోక్ పాల్గొన్నారు.

విద్యార్థినికి కాంస్య పతకం



మహబూబాబాద్ అర్బన్: హనుమకొండలోని జేఎన్ఎస్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అనంతారం మోడల్ స్కూల్ విద్యార్థిని హారిక ప్రతిభ కనబర్చింది. అండర్ 18 విభాగంలో 400 మీటర్లలో పరుగుపందెంలో కాంస్య పతకం సాధించినట్లు ప్రిన్సిపాల్ అమరావతి, పీడీ సింధువర్మ తెలిపారు. బుధవారం హారికను అభినందించారు.

నిరాశ్రయులను ఆదుకోవాలి



గూడూరు: ప్రతీ ఒక్కరు మానవతా దృక్పథంతో ఆపదలో ఉన్నవారిని, నిరాశ్రయులను ఆదుకోవాలని ఎమ్మెల్యే ధనసరి సీతక్క అన్నారు. ములుగు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే సీతక్క నివాసంలో బుధవారం మండలంలోని గాజులగట్టుకు చెందిన కాంగ్రెస్ నాయకులు ముంపునకు గురైన నిరాశ్రయులకు 10క్వింటాళ్ల సన్న బియ్యం బస్తాలను ఎమ్మెల్యే ద్వారా అందించారు. కార్యక్రమంలో నాయకులు ఎండి.యాకూబ్‌పాషా, పడిగ రమేష్, ఉపసర్పంచ్ ఎలికట్టె వెంకన్నగౌడ్, బాలు, చంద్రమౌళిగౌడ్, రమేష్ పాల్గొన్నారు.

ప్రశ్నిస్తే కేసులా?

కురవి: ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ నియోజకవర్గ పర్యటనలో భాగంగా నేరడ గ్రామంలో పర్యటించిన సమయంలో ప్రశ్నిస్తే అక్రమంగా కేసులు బనాయించడాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆకుల రాజు, మండల కార్యదర్శి మల్లిడి కోటయ్య ఖండించారు. బుధవారం నల్లపు సుధాకర్ అధ్యక్షతన మండల కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో నాయకులు కిషన్‌నాయక్, కృష్ణయ్య, తిరుపతి, మల్సూర్, మల్లయ్య, వెంకన్న పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

గూడూరు: గూడూరుకు చెందిన పుట్ట వెంకన్న అనే వ్యక్తి బుధవారం ఉదయం మానుకోటకు పనిపై వెళ్లి తిరిగి వస్తుండగా దామరవంచ సమీపంలో చక్రవాహనం టైర్ పేలి కింద పడ్డాడు. దీంతో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే గూడూరు సీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తలించారు.

తల్లిపాల వారోత్సవాలు

మరిపెడ రూరల్: మండలంలోని నీలికుర్తి గ్రామ పంచాయతీ పరిధిలోని మూన్యతండా అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గొల్లపల్లి రాణి పాల్గొన్నారు.

కురవి: మండలంలోని బలపాల శివారు లింగ్యా తండా గ్రామంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాంలాల్, అంగన్‌వాడీ టీచర్లు కుమారి, దేవమణి పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధులకు సన్మానం

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో మేరీ మాటీ మేరా దేశ్ కార్యక్రమం పురస్కరించుకొని బుధవారం స్వాతంత్ర్య సమరయోధులను, ఆర్మీ ఉద్యోగ విరమణం పొందిన వారిని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వద్దిరాజు రామచందర్ రావు, జిల్లా నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, ప్రోగ్రామ్ జిల్లా కోఆర్డినేటర్ సంపత్ రావు, మహిళా జిల్లా మోర్చా అధ్యక్షురాలు ఓర్సు పద్మ, నాయకులు పాల్గొన్నారు.

జర్నలిజంలో డాక్టరేట్



మరిపెడ: మండలానికి చెందిన బానోతు లక్ష్మీబాయి గిరిజన జీవన శైలిపై టెలివిజన్ ప్రభావం అనే పరిశోధన అంశాన్ని తీసుకొని ఎంఫిల్ పూర్తి చేయడంతో తెలుగు విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సత్తిరెడ్డి డాక్టరేట్ ప్రదానం చేశారు.

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం బుధవారం జిల్లా వ్యాప్తంగా పలు సంఘాల, పార్టీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కొమురం భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ..

దేశంలో ఉన్న అటవీ ప్రాంత ఆదివాసీ, గిరిజన ప్రజలు దేశ స్వాతంత్రోద్యమంలో చెప్పుకోదగ్గ పాత్ర పోషించారన్నారు. 1994లో ఐక్యరాజ్యసమితి ఆగస్టు 9న అంతర్జాతీయ ఆదివాసీల దినోత్సవంగా ప్రకటించిందన్నారు.

- సాక్షి నెట్‌వర్క్



మహబూబాబాద్ అర్బన్: నివాళులర్పిస్తున్న నాయకులు



గూడూరు: కొమురం భీం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న తుడుందెబ్బ నాయకులు



గార్ల: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



బయ్యారం: కొత్తపేటలో..



గార్ల: నివాళులర్పిస్తున్న ఆదివాసీలు



కురవి: సంఘం జెండా ఆవిష్కరించిన నాయకులు



కేసముద్రం: నర్సింహులగుడెం పాఠశాలలో ఆదివాసీలకు సన్మానం

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మహబూబాబాద్: ధర్నా చేస్తున్న సంఘాల నాయకులు

మహబూబాబాద్: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కె.నాగన్న, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రేషపల్లి నవీన్, పీఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి హెచ్చు లింగన్న డిమాండ్ చేశారు. సంఘాల ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. బడా వ్యాపారులకు న్యాయం చేయడం కోసం నాలుగు లేబర్ కోడ్స్ చేసి కార్మికులకు తీరని అన్యాయం చేశారన్నారు. కోడ్స్ రద్దు చేసి 44 కార్మిక చట్టాలను అమలు చేయకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో శ్యాం, సుదాకర్, వెంకన్న, కుమార్, శంకర్, సోమయ్య, కోటేష్, మధు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

నెల్లికుదురు: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని వామపక్షాల నాయకులు ఇస్సంపెల్లి సైదులు, యాసం వెంకన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో బుధవారం రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు స్వామి, అనిల్, వెంకన్న, వెంకటేశ్వర్లు, యాకూబ్, వెంకన్న, తిలక్ బాబు పాల్గొన్నారు.

కేసముద్రం: కార్మిక చట్టాల పరిరక్షణ కోసం సమరశీల పోరాటాలు నిర్వహించాలని ఏఐటీయూసీ మండల కార్యదర్శి మంద భాస్కర్, సీఐటీయూ మండల కార్యదర్శి జల్లె జయరాజ్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి శివారపు శ్రీధర్ అన్నారు. బుధవారం తహసీల్దార్ నరేష్‌కు మెమోరాండం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కిషన్, లింగస్వామి, రాజు, ఎల్లయ్య పాల్గొన్నారు.

పొలం గెట్టు పంచాయితీ

ఇరువర్గాలకు తీవ్రగాయాలు

కురవి: పొలం వద్ద గెట్టు పంచాయితీలో రెండు కుటుంబాలకు చెందిన వ్యక్తులకు తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని కంచర్లగూడెం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కంచర్లగూడేనికి చెందిన తేజావత్ కిషన్, ప్రశాంత్ తండ్రీకొడుకులు, మరో కుటుంబానికి చెందిన తేజావత్ ఈర్యనాయక్, పవన్‌కల్యాణ్‌లు తండ్రికొడుకులు. వీరు ఇరువురు పొలం వద్ద పనులు చేసుకుంటున్నారు. రెండు కుటుంబాల మధ్య భూవివాదం నెలకొంది. ఈనేపథ్యంలో బుధవారం పొలం వద్ద ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి దాడులు చేసుకున్నారు. గాయాలపాలైన వ్యక్తులను మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. విషయమై కురవి ఎస్సై గోపిని వివరణ కోరగా ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని తెలిపారు.

ధర్నాను విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సంఘాల నాయకులు

మహబూబాబాద్ అర్బన్: ఉపాధ్యాయుల సమస్యలపై ఈనెల 12న జిల్లా కేంద్రంలో జరగనున్న యూఎస్ పీసీ ధర్నాను విజయవంతం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సామా మల్లారెడ్డి, టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కవిత పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో బుధవారం వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ధర్నాకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్, టీపీటీఎఫ్ సంఘాల నాయకులు యాకుబ్, చుంచు శ్రీశైలం, భీముడు, మంజుల, హుస్సేన్, రమేష్, శ్రీనివాస్, విష్ణువర్ధన్, ఉపేందర్, సంజీవ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా బోనాల సందడి

అమ్మా.. మమ్ము సల్లంగా సూడు.. పిల్లా పాపలు, పాడి పంటలు, అన్నీ బాగుండాలి, ఏడాది అంతా మంచి జరగాలి.. నీ మొక్కులన్నీ తీర్చుకుంటాం.. నీవే దిక్కు తల్లీ.. అంటూ రెండు చేతులు జోడించి ప్రజలు వేడుకున్నారు. బుధవారం బోనాల పండగను పలు గ్రామాల్లో ప్రజలు ఘనంగా నిర్వహించారు. శ్రవణ మాసం కావడంతో గ్రామ దేవతలకు ఆయా గ్రామాల్లో ఇంటికి ఒక్క బోనం చొప్పున మహిళలు డప్పుచప్పుళ్ల నడుమ ఊరేగింపుగా దేవతలకు వద్దకు తీసుకువచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

- సాక్షి నెట్‌వర్క్



తొర్రూరు: మొక్కులు చెల్లిస్తున్న ఉషాదయాకర్‌రావు, గ్రామస్తులు



గార్ల: విశ్వశాంతి విద్యాలయంలో బోనాలతో చిన్నారులు



చిన్నగూడూరు: మండల కేంద్రంలో..



పెద్దవంగరలో..

క్విట్‌ఇండియా ఉద్యమం చరిత్రాత్మకం



మహబూబాబాద్ రూరల్: జెండా ఆవిష్కరిస్తున్న బెల్లయ్యనాయక్

మహబూబాబాద్ రూరల్: క్విట్ ఇండియా ఉద్యమం చరిత్రాత్మకమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఆదివాసీ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్ అన్నారు. క్విట్ ఇండియా దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని నర్సంపేట బైపాస్ సెంటర్‌లో బెల్లయ్యనాయక్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముల్లంగి ప్రతాప్ రెడ్డి, జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు, గుగులోతు వెంకట్ నాయక్, తేజావత్ శంకర్ నాయక్, యాకూబ్ పాషా, యుగేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిద్రించిన తండాను మరిచిన కేసీఆర్

నెల్లికుదురు: పల్లెనిద్రలో భాగంగా నిద్రించిన తండానే మరిచిన ఘనుడు సీఎం కేసీఆర్ అని కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు తేజావత్ బెల్లయ్య నాయక్ మండిపడ్డాడు. ఆదివాసీల దినోత్సవాన్ని పురస్కరించకుని కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ఇచ్చిన పిలుపులో భాగంగా మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం తారాసింగ్ బావితండా శివారు భీమానాయక్ తండాలో బుధవారం పల్లె నిద్ర కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్ గౌడ్, యాదవరెడ్డి, వెంకటేశ్వర్లు, అశోక్ గౌడ్, మానేందర్, లింగ్యానాయక్, వీరన్న నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించని ప్రభుత్వాలు

నెహ్రూసెంటర్: దేశంలో మహిళలపై దాడులు, అఘాయిత్యాలు పెరిగిపోయాయని, మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) జిల్లా ప్రధాన కార్యదర్శి మామిండ్ల సాంబలక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని వీరభవన్‌లో సంఘం పట్టణ కౌన్సిల్ సమావేశం ఎండి. అలీమా అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబలక్ష్మీ మాట్లాడుతూ.. మణిపూర్‌లో జరిగిన దారుణ ఘటనలు వెలుగు చూస్తున్న అక్కడి ప్రభుత్వంపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని విమర్శించారు. సమావేశంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండి.ఫాతిమా, పద్మ, రాణి, మాధవి, లక్ష్మీ, ఉమ పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం పట్టివేత



మహబూబాబాద్ రూరల్: నిందితులను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

మహబూబాబాద్ రూరల్: జిల్లా ఎక్సైజ్ శాఖ టాస్క్‌ఫోర్స్ అధికారులు ప్రత్యేక దాడులు నిర్వహించి 30క్వింటాళ్ల నల్లబెల్లం, 60కిలోల పటిక, 30లీటర్ల గుడుంబాను పట్టుకోవడంతోపాటు ఇద్దరిని అరెస్టు చేసి ఒక వాహనాన్ని సీజ్ చేశారు. ఎక్సైజ్ శాఖ డీటీఎఫ్ సీఐ బి.కృష్ణ మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ వద్ద బుధవారం కేసు వివరాలు వెల్లడించారు. డోర్నకల్ మండలం ముల్కలపల్లి గ్రామ శివారులో ఎక్సైజ్ శాఖ డీటీఎఫ్ అధికారులు, సిబ్బంది మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు ప్రత్యేక రూటు వాచ్ నిర్వహించారు. ఈ క్రమంలో అశోక లేలాండ్ వాహనం అనుమానాస్పదంగా కనిపించగా దాన్ని ఆపి విచారించారు. అందులో నల్లబెల్లం, పటిక, గుడుంబా లభ్యమయ్యాయి. వాటిని స్వాధీనం చేసుకుని ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. ఈకేసులో ఖమ్మంకు చెందిన ఉట్కూరు కుమారస్వామి, మహబూబాబాద్ మండలంలోని చోక్ల తండా గ్రామానికి చెందిన గుగులోత్ రవి అనే ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. ఏపీ రాష్ట్రంలోని చిత్తూరు నుంచి నల్లబెల్లం తీసుకువస్తున్నట్లు గుర్తించారు. ఎక్సైజ్ సీఐ చిరంజీవి, ఎస్సై హరీశ్, సిబ్బంది వెంకన్న, నర్సింహారావు పాల్గొన్నారు.

28 క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత

కేసముద్రం: కర్నాటకలోని బీదర్ నుంచి అశోక్‌లేలాండ్ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం, పటికను పట్టుకున్నట్లు ఎస్సై తిరుపతి బుధవారం తెలిపారు. కల్వల గ్రామానికి చెందిన ఎండి.అమీర్, మునికుంట్ల నరేష్, ఎండి.అజారుద్దీన్‌లు కలిసి, కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ నుంచిరూ.2.85లక్షల విలువైన 58 బస్తాల నల్లబెల్లం(28క్వింటాళ్లు), 50 కేజీల పటికను అశోకలేలాండ్ వాహనంలో కేసముద్రం మండలం కల్వల గ్రామానికి తరలించారు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు అమీర్ ఇంటి ముందర ఉన్న అశోక లేలాండ్ వాహనాన్ని అనుమానంతో తనిఖీ చేశారు. దీంతో ఆ వాహనంలో నల్లబెల్లం, పటిక లభ్యమైంది. కాగా బెల్లం, పటిక స్వాధీనం చేసుకుని, వాహనాన్ని సీజ్ చేసి, ఆ ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

'గృహలక్ష్మి' గడువు పొడిగించాలి

గార్ల/నెల్లికుదురు/దంతాలపల్లి/నెహ్రూసెంటర్: గృహలక్ష్మి పథకం గడువు తేదీని పొడిగించాలని పలువురు నాయకులు బుధవారం డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్‌గౌడ్, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా కార్యదర్శి ఇరుగు అనిల్, సీపీఎం, సీపీఐ నాయకులు శ్రీనివాసరావు, శ్రీనివాస్, సీపీఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్ ఉన్నారు.

భారీగా దరఖాస్తులు

డోర్నకల్: గృహలక్ష్మి పథకానికి రెండు రోజుల్లో 800 మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. గురువారం గడువు ముగుస్తుండటంతో చివరి రోజు భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

సంక్షిప్త సమాచారం

కేంద్ర బృందం పరిశీలన

నర్సింహులపేట: స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ 2023 ఇంటింటి సర్వేలో భాగంగా బుధవారం మండల కేంద్రంలో కేంద్ర బృందం సభ్యుడు సంపత్ వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సన్యాసయ్య, డీఎల్‌పీఓ సర్ఫోద్దీన్, ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి, ఎంపీఓ సోమ్‌లాల్, సర్పంచ్ వేముల రజిత పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపిక

నర్సింహులపేట: మహబూబాబాద్‌లో జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో నర్సింహులపేట హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు వై.రాంచరణ్, సీహెచ్.యశ్వంత్, ఎస్.శ్రావణి రాష్ట్ర స్థాయి యోగా క్రీడా పోటీలకు ఎంపికైనట్లు బుధవారం హెచ్‌ఎం శ్రీలత తెలిపారు.

డిపో అభివృద్ధికి కృషి చేయాలి

నెహ్రూసెంటర్: ఆర్టీసీ ఉద్యోగులు డిపో అభివృద్ధికి కృషి చేయాలని డిపో మేనేజర్ జె.విజయ్ అన్నారు. డిపోలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన కండక్టర్లు ఎన్.వీరన్న, వి.ఉమ టీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజియన్ మేనేజర్ శ్రీలత ప్రశంసాపత్రాలను బుధవారం అందజేశారు.

సర్వే వివరాలను బహిర్గతం చేయాలి

మహబూబాబాద్: నేషనల్ హైవే 930పీ సర్వే వివరాలను బహిర్గతం చేయాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారథి రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, కమిషనర్ ప్రసన్నరాణి, అధికారులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

కురవి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మోద్గులగూడెం గ్రామానికి చెందిన కందిపాటి ప్రభాకర్‌కు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన రూ.50వేల చెక్కును ఎంపీడీఓ సరస్వతి బుధవారం అందజేశారు.

రైతులకు పరిహారం ఇవ్వాలి

కురవి: ఇటీవల కురిసిన వర్షాలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీఎస్పీ ఆధ్వర్యంలో బుధవారం సీరోలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ కోమలకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు తగరం నాగన్న, శ్రీరామ్, రషీద్, ఉపేంద్రమ్మ, ఎలుగు రామనర్సమ్మ పాల్గొన్నారు.

దేశాన్ని కాపాడుకుందాం

కురవి: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని, క్విట్ ఇండియా స్ఫూర్తితో దేశాన్ని కాపాడుకుందామని సీఐటీయూ మండల కన్వీనర్ పోతుగంటి మల్లయ్య, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు కర్నం రాజన్న అన్నారు. బుధవారం బస్టాండ్ నుంచి జాతీయ రహదారి వరకు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో పోగుల శ్రీనివాస్, షేక్ మంజూర్ అలీ, ఉపేంద్రాచారి, రామచంద్రయ్య, లచ్చయ్య పాల్గొన్నారు.

ఆస్పత్రి సమస్యలపై దృష్టి సారిస్తాం

డోర్నకల్: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సమస్యలపై దృష్టి సారిస్తామని ఎంపీపీ ధరంసోత్ బాలునాయక్ తెలిపారు. పీహెచ్‌సీలో బుధవారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పాడిశెట్టి కమలారామనాథం, మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, తహసీల్దార్ కె.నాగభవాని, ఎంపీడీఓ అపర్ణ, వైద్యాధికారి సాధ్విజ పాల్గొన్నారు. ప్రజాప్రతినిధులు హాజరుకాకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేశారు.

మహనీయులను అవమానిస్తారా..

మహబూబాబాద్ రూరల్: మహనీయుల విగ్రహాలను పట్టించుకోకుండా వదిలేయడం విచారకరమని తెలంగాణ రాష్ట్ర ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్ అన్నారు. ప్రపంచ ఆదివాసీ గిరిజన దినోత్సవం సందర్భంగా పట్టణంలోని కొమురం భీం, వివేకానంద విగ్రహాల ఎదుట బుధవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మాజీ పట్టణ అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు, ఎస్టీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ వెంకట్ నాయక్, ఎస్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు శంకర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

కురవి: పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్, అరవింద్, ఈశ్వర్, బాలు, నవీన్, బన్నీ పాల్గొన్నారు.

ప్రమోషన్లు, బదిలీలు చేపట్టాలి

డోర్నకల్: ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లను ప్రభుత్వం వెంటనే చేపట్టాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మిరియాల సతీష్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని డోర్నకల్, ముల్కలపల్లి తదితర గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం నిర్వహించిన పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. పీఆర్‌టీయూలో చేరిన ఉపాధ్యాయుడు ప్రమోద్‌కు సభ్యత్వం అందించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు సీతారాములు, ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, రాష్ట్ర, జిల్లా నాయకులు కృష్ణారెడ్డి, సీహెచ్ శ్రీధర్, ప్రభుదాస్ పాల్గొన్నారు.

దోపిడీదారులకు వ్యతిరేకంగా పోరాడుదాం

నెహ్రూసెంటర్: అటవీ సంపదను దోచుకుంటున్న దోపిడీదారులకు వ్యతిరేకంగా పోరాడాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా మహబూబాబాద్ సంయుక్త మండలాల సహాయ కార్యదర్శి పైండ్ల యాకయ్య బుధవారం పిలుపునిచ్చారు. నాగేశ్వర్‌రావు, రాము, మహేందర్ పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

మహబూబాబాద్ రూరల్/గూడూరు: యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గుగులోత్ వంశీనాయక్, మండల యూత్ అధ్యక్షుడు చంటి స్వామి మండల అధ్యక్షుడు, సర్పంచ్ రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

నష్టపరిహారం అందించాలి

గంగారం: ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించాలని ఎంపీపీ సువర్ణపాక సరోజన ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల స్పెషలాఫీసర్ బాలరాజు, తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఏఓ ఉదయ్, ఎంపీఓ వద్మ, వైస్ ఎంపీపీ ముడిగ వీరభద్ర, పోతయ్య, సర్పంచ్ పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

మహబూబాబాద్ అర్బన్: మానుకోట మున్సిపల్ పరిధిలోని ముత్యాలమ్మగూడెం గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో బుధవారం ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో గిరిజన శాఖ జీసీడీఓ కె.విజయ, ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, ఉపాధ్యక్షుడు వెంకన్న, రజిత పాల్గొన్నారు.

వీధి దీపాలు లేక ఇబ్బందులు



మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీ పరిధిలో పలుప్రాంతాలలో వీధి దీపాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, వాటిని వెంటనే ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సూర్నపు సోమయ్య డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సూర్నపు సోమయ్య మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే ఉన్నా సమస్యలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అనంతరం చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, కమిషనర్ ప్రసన్నరాణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సమ్మెట రాజమౌళి, సీతారాం, హేమా పాల్గొన్నారు.

లింక్ క్లిక్.. డబ్బులు మాయం

గార్ల: సెల్‌ఫోన్ వాట్సాప్‌కు వచ్చిన లింక్ క్లిక్ చేస్తే మీ అకౌంట్‌లో డబ్బులు జమ అవుతాయని సైబర్ నేరగాళ్లు.. ఓ మహిళకు మాయమాటలు చెప్పి మోసం చేసిన ఘటన గార్లలో బుధవారం ఆలస్యంగా వెలుగుచూసింది. గార్ల తహసీల్దార్ బజార్‌కు చెందిన సయ్యద్ జరీనా సెల్‌ఫోన్ వాట్సాప్‌కు 2 నెలల క్రితం సైబర్ నేరగాడు ఒక లింక్ పంపాడు. ఈ లింక్ క్లిక్ చేస్తే మీ అకౌంట్‌లో రూ.150 యాడ్ అవుతాయని చెప్పగా, ఆమె లింక్‌పై క్లిక్ చేసింది. వెంటనే ఆమె అకౌంట్‌లో రూ.150 జమ అయ్యాయి. మరుసటి రోజు యూట్యూబ్ చానల్‌లో సబ్‌స్క్రైబ్ చేయమని చెప్పగా ఆమె మళ్లీ లైక్ కొట్టింది. అప్పుడు కూడా మహిళ అకౌంట్‌కు రూ.150 జమ అయ్యాయి. ఇలా మహిళను నమ్మబలికించిన నేరగాళ్లు.. మీకు ఎక్కువ డబ్బు రావాలంటే తమ అకౌంట్లో రూ.2,000 వేయాలని కోరగా జరీనా ఆశతో 3 దఫాలుగా రూ.27 వేలు వేసింది. డబ్బు అకౌంట్‌కు రావడం లేదని నేరగాడికి ఫోన్ చేయగా లిఫ్ట్ చేయకపోగా, స్విచ్ఛాఫ్ వస్తోంది. దీంతో మోసపోయనని గ్రహించిన ఆమె స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సైబర్ క్రైం ఆదేశాల మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకన్న తెలిపారు.